# కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం



బీఆర్ఎస్‌లో చేరిన వడ్డెర కాలనీ వాసులతో ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

- కాంగ్రెస్, బీజేపీ మాయలో పడొద్దు
- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి
- బీఆర్ఎస్‌లో వేలాదిగా చేరికలు

ఆర్మూర్/మాక్లూర్, అక్టోబర్ 4: సీఎం కేసీఆర్ హయాంలోనే తెలంగాణ అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతున్నదని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు, కుల సంఘాల సభ్యులు, కాంగ్రెస్, బీజేవైఎం నాయకులు పెద్ద సంఖ్యలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఆర్మూర్ పట్టణానికి చెందిన వడ్డెర సంఘ సభ్యులు, పెర్కిట్ వీడీసీ అధ్యక్షుడు, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి పసుపుల సాయి కుమార్, నాయిక్‌పోడ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మూడ అశోక్, పలువురు యువకులు, ఆర్మూర్ మండలం గగ్గపల్లి మాల సంఘ సభ్యులు, రాంపూర్‌కు చెందిన అన్ని కుల సంఘాల ప్రతినిధులు, ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన శౌకపట్ల కాలనీవాసులు, మాక్లూర్ మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ కర్రెన్న, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూన చిన్న గంగారాం, ఇతర నాయకులు పార్టీలో చేరగా, వారికి జీవన్‌రెడ్డి గులాబీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ మాయలో పడకూడదని సూచించారు. ఆర్మూర్ పట్టణంతోపాటు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. బీఆర్ఎస్‌కు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆర్మూర్, మాక్లూర్ ఎంపీపీలు నర్సయ్య, ప్రభాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్నా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో యాదాద్రి దర్శనం

మాక్లూర్ మండలం గొట్టిముక్కుల, మెట్టుపల్లి గ్రామాలకు చెందిన వందమందికి పైగా భక్తులు బుధవారం యాదాద్రి దర్శనానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారి కోసం ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సొంత ఖర్చులతో రెండు ప్రత్యేక బస్సులు, ఇతర ప్రయాణ ఏర్పాట్లు చేశారు. భక్తులు మొదట ఆర్మూర్ సిద్ధులగుట్టను దర్శించుకొని అక్కడే అల్పాహారం చేశారు. అనంతరం జీవన్‌రెడ్డి జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభించారు.



జెండా ఊపి యాదాద్రి బస్సు యాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

## రేపు ధర్పల్లి, బిచ్కుందకు మంత్రి హరీశ్‌రావు రాక

ధర్పల్లి, అక్టోబర్ 4 : రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఈనెల 6వ తేదీన రానున్నట్లు ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రంలో రూ. 33 కోట్లతో చేపట్టే వంద పడకల దవాఖాన నిర్మాణం, రూ. 6.5 కోట్లతో చేపట్టే రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులను రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ శ్రేణులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ ఒక ప్రకటనలో కోరారు.

నిజాంసాగర్, అక్టోబర్ 4: బిచ్కుందలో సైతం మంత్రి హరీశ్‌రావు పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రావుదేశాయ్ తెలిపారు. బిచ్కుందలో వంద పడకల దవాఖాన నిర్మాణ పనులను ఆయన ప్రారంభిస్తారని తెలిపారు. మండల కేంద్రంలో హెలీప్యాడ్ స్థలాన్ని సొసైటీ చైర్మన్ బాలు, నాయకుడు గణేశ్‌గౌండతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు.

## రెండిండ్లలో చోరీకి యత్నం

- దొంగను పట్టుకొని దేహశుద్ధి చేసిన స్థానికులు

భిక్కనూరు, అక్టోబర్ 4 : కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలోని జంగంపల్లిలో మంగళవారం రాత్రి తాళాలు వేసిన ఇండ్లల్లోకి చొరబడి చోరీకి యత్నించిన ఒకరిని స్థానికులు పట్టుకున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగంపల్లిలోని వసంతకాలనీలో ఇద్దరు వ్యక్తులు రెండిండ్లలోచోరీకి యత్నించారు. ఇద్దరు యువకులు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడుతుండగా, శబ్దాలు విని స్థానికులు లేవడంతో, ఒకరు ద్విచక్ర వాహనంపై పారిపోగా... మరో దొంగ ఇంట్లోనే గడియ పెట్టుకొని ఉన్నాడు. కాలనీ వాసులు దొంగను పట్టుకొని దేహశుద్ధి చేశారు. పోలీసులకు సమాచారం అందించగా.. వారు ఘటనాస్థలానికి చేరుకొని దొంగను అదుపులోకి తీసుకున్నారు.

## బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు మాయం

నందిపేట్, అక్టోబర్ 4: డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి గ్రామానికి చెందిన పుండ్రు రాజేందర్‌కు చెందిన రూ.5,36,700 దుండగులు మాయం చేసినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. గతనెల 30న పుండ్రు రాజేందర్ తన పంట పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా ఫోన్‌కు డబ్బులు విత్‌డ్రా చేసినట్లు మెస్సేజ్ వచ్చింది. మొదట రూ.2 లక్షలు తర్వాత రూ.2 లక్షలు, రూ.లక్ష, రూ.36,700 నాలుగు దఫాలుగా యూనియన్ బ్యాంకులోని ఖాతా నుంచి తీసినట్లు మెస్సేజ్ వచ్చింది. బ్యాంకుకు వెళ్లి విచారణ చేయగా.. వేరే రాష్ట్రంలో నుంచి ఖాతాలోని డబ్బులు తీశారని సిబ్బంది చెప్పారు. తనకు న్యాయం చేయాలని సైబర్‌క్రైమ్ పోలీసులు, నందిపేట్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు అందించాడు.

## ఉమ్మడి జిల్లాల వాలీబాల్, క్రికెట్ ఎంపికలు

డిచ్‌పల్లి/ నిజామాబాద్ స్పోర్ట్స్, అక్టోబర్ 4 : ఉమ్మడి జిల్లాల వాలీవాల్, క్రికెట్ ఎంపిక పోటీలను మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. మండలంలోని గన్నారం జడ్పీహెచ్ఎస్‌లో వాలీబాల్ అండర్-14, 17 బాలబాలికల ఎంపిక నిర్వహించారు. సుద్దపల్లిలోని జడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో క్రికెట్ అండర్-17 బాలబాలికల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సంగీతారావు ఆధ్వర్యంలో కొనసాగాయి. విద్యార్థులు క్రీడల్లో రాణించేలా శిక్షణ శిబిరం నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు గాయత్రి, నరేశ్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు టి.విద్యాసాగర్‌రెడ్డి, మల్లేశ్ గౌడ్, సుద్దపల్లి సర్పంచ్ రూపా సతీశ్‌రెడ్డి, స్కూల్ గేమ్స్ కమిటీ మెంబర్ గంగామోహన్, నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీధర్, సురేశ్, కృష్ణంరాజు, ఆనంద్, భూపతి, అజ్మత్, రమేశ్, బాలయ్య, సురేందర్, సుష్మ, మధు, యాదగిరి, లత పాల్గొన్నారు.

# మంత్రి వేములపై వృద్ధుడి బతుకమ్మ పాట



వృద్ధుడు మేకల (గంగం) రాజన్నను శాలువాతో సత్కరిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

**శాలువాతో సత్కరించిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి**

భీమ్‌గల్, అక్టోబర్ 4 : మండలంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పలు అభివృద్ధి పనుల ప్రారంభ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం పర్యటిస్తున్న సందర్భంగా పల్లికొండ గ్రామం మీదుగా వెళ్తుండగా బీఆర్ఎస్ నేత గంగం కిషన్ ఇంటి వద్ద ఆగారు. మంత్రి వేముల చేసిన అభివృద్ధిపై అదే గ్రామానికి చెందిన వృద్ధుడు మేకల (గంగం) రాజన్న బతుకమ్మ పాట పాడి వినిపించాడు. ఆయన పాటకు అక్కడున్న యువత, బీఆర్ఎస్ శ్రేణులు గొంతు కలిపారు. తనపై అభిమానంతో బతుకమ్మ పాట రూపొందించిన రాజన్నను మంత్రి వేముల శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. రాజన్న అనేక సామాజిక అంశాలపై పాటలు రూపొందించాడని తెలుసుకున్న మంత్రి ఆయన పాటలను పుస్తకంలో ముద్రించే ఏర్పాటు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. సామాజిక స్పృహ కలిగిన పాటలు పుస్తక రూపంలో, ఆడియో రూపంలో నిక్షిప్తమై ఉంటే ఎక్కువ మందికి చేరుతాయని, భవిష్యత్తు తరాలకు ఉపయోగపడుతాయని అన్నారు.

# నిజామాబాద్ జిల్లా ఓటర్లు..

# 13,65,811



ఖలీల్‌వాడి, అక్టోబర్ 4 : నిజామాబాద్ జిల్లా ఓటర్ల లెక్క తేలింది. జిల్లాలో మొత్తం 13 లక్షల 65 వేల 811 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు వెల్లడించారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గాల వారీగా పోలింగ్‌స్టేషన్లు, మహిళలు, పురుషులు, ఇతరుల ఓటర్ల వివరాలను తెలిపారు. జిల్లాలో మహిళా ఓటర్లు 7,18,603 ఉండగా.. పురుషులు 6,47,149, ఇతరులు 59 మంది ఉన్నారు. పురుషుల కన్నా మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండడం విశేషం.

### నిజామాబాద్ జిల్లా వారీగా ఓటర్ల వివరాలు

| నియోజకవర్గం | పోలింగ్‌స్టేషన్లు | పురుషులు | స్త్రీలు | ట్రాన్స్‌జెండర్‌లు | మొత్తం |
|---|---|---|---|---|---|
| ఆర్మూర్ | 217 | 96,404 | 1,09,933 | 07 | 2,06,344 |
| బోధన్ | 246 | 1,03,577 | 1,12,381 | 05 | 2,15,963 |
| బాన్సువాడ | 258 | 92,225 | 1,00,608 | 08 | 1,92,841 |
| నిజామాబాద్ అర్బన్ | 289 | 1,39,163 | 1,47,571 | 32 | 2,86,766 |
| నిజామాబాద్ రూరల్ | 293 | 1,16,052 | 1,32,212 | 05 | 2,48,269 |
| బాల్కొండ | 246 | 99,728 | 1,15,898 | 02 | 2,15,628 |
| **మొత్తం** | **1549** | **6,47,149** | **7,18,603** | **59** | **13,65,811** |

# స్తంభాలు పీకేశారు.. చెట్లు నరికేశారు..

- ప్రధాని మోదీ సభ కోసం అత్యుత్సాహం
- అంధకారంలో సమీకృత కలెక్టరేట్
- ఇష్టారాజ్యంగా చెట్ల నరికివేత




పచ్చని చెట్లను తొలగించి హెలీప్యాడ్ కోసం వేసిన రోడ్డు

ఖలీల్‌వాడి, అక్టోబర్ 4 : నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సర్వహంగులతో సమీకృత కలెక్టరేట్ భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్మించింది. ఆహ్లాదాన్ని పంచే విధంగా కలెక్టరేట్ ఆవరణలో విస్తృతంగా చెట్లను పెంచారు. కాగా ఈ నెల 3న ప్రధాని మోదీ వస్తున్న సందర్భంగా హెలీప్యాడ్ కోసం కలెక్టరేట్‌లోని పచ్చని చెట్లను నరికివేశారు. అంతేకాకుండా కలెక్టరేట్‌కు విద్యుత్ సరఫరా అయ్యే స్తంభాలు, తీగలను ధ్వంసం చేశారు. దీంతో ఈ నెల 2 నుంచి బుధవారం వరకు విద్యుత్ సరఫరాలేక కలెక్టరేట్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ఎక్కడిపనులు అక్కడే ఆగిపోయాయి. విద్యుత్ మరమ్మతులు బుధవారం రాత్రి వరకు అయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. చీకట్లోనే కలెక్టరేట్ అధికారులు పనులను చేస్తున్నారు. ముఖ్యమైన విభాగాల్లో జనరేటర్ సహాయంతో పనులు చేస్తున్నారు. పచ్చని గార్డెన్‌లో హెలీప్యాడ్ కోసం బీటీ రోడ్డు వేయడంపై కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు మండిపడుతున్నారు.

### మరమ్మతులు జరుగుతున్నాయి : కలెక్టరేట్ ఏవో ప్రశాంత్

కలెక్టరేట్ వద్ద మరమ్మతులు పనులు జరుగుతున్నాయి. విద్యుత్ లేక చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. బుధవారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తాం. హెలీప్యాడ్‌కి అసౌకర్యం కలుగకుండా విద్యుత్ తీగలని కేంద్ర బలగాలు తీయించారు.



స్తంభాలను పీకేయడంతో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది